క్లుప్తంగా

మాజీ సీఎం జగన్‌ను కలసిన కృష్ణుడు



జగన్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన యనమల కృష్ణుడు

తుని: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని తునికి చెందిన ఆ పార్టీ సీనియర్ నాయకుడు యనమల కృష్ణుడు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో జగన్‌ను కలసి తుని నియోజకవర్గంలో పరిస్థితిని వివరించారు. మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ఆధ్వర్యంలో పార్టీని బలోపేతానికి కృషి చేయాలని జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్టు కృష్ణుడు తెలిపారు. జగన్ ఆదేశాల మేరకు తుని నియోజకవర్గంలో ప్రజల తరఫున పోరాటం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజల్లోకి తీసుకువెళతామని తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఏలేశ్వరం: ప్రస్తుత వేసవిలో ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో ప్రజలు వడదెబ్బకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు, వైద్యుడు ఎస్.విజయబాబు సూచించారు. స్థానిక బాలాజీచౌక్ వద్ద బుధవారం ప్రకృతి పర్యావరణ పరిరక్షణ ఆధ్వర్యంలో ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి గోళ్ల నాగేశ్వరరావు, సభ్యులు తాళ్లూరి గొల్లాజీరావు, డీవీవీ సత్యనారాయణ, తిరగటి సత్యనారాయణ, సహదేవుడు, చిదంబరం తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనుల పరిశీలన

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు నుంచి ఉప్పలపాడు వెళ్లే మార్గంలో జరుగుతున్న రహదారి పనులను గురువారం అధికారులు పరిశీలించారు. ఉప్పలపాడులో వీధి దీపాల నిర్వహణ, ఆక్రమణల తొలగింపుపై పంచాయితీ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ వై. ఉమా శంకర్, ఎంపీడీఓ నాతి బుజ్జి, గ్రామ సర్పంచ్ అడబాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ సేవా సమితికి విరాళం



తుని ఆసుపత్రిలో పేదలకు అన్నదానం చేస్తున్న దృశ్యం

తుని: పేదలకు ఉచితంగా అన్నదానం చేస్తున్న సరస్వతీ విద్యా సేవా సమితి సేవలు ఆదర్శనీయమని తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ స్వప్న అన్నారు. గురువారం ఆసుపత్రిలో అన్నదానం చేసిన సేవా సమితి అధ్యక్షుడు గొర్రెల శివరామకృష్ణకు స్వప్న రూ.10 వేలు విరాళాన్ని అందజేశారు. తుని ఆసుపత్రికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు అన్నదానం చేశారు. ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో బాధిత కుటుంబానికి వైఎస్సార్ సీపీ నేత, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు గురువారం ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన బల్ల బాబి సతీమణి నూకరత్నం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. వారి కుటుంబాన్ని మురళీరాజు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసున్నారు. అనంతరం రూ.ఐదు వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో కోలా తాతబాబు, పోకనాటి వెంకటేశ్వరరావు, కోన బాబ్జి, జువ్వల దొరబాబు, దాడి పుత్రయ్య, పెండ్యాల అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



రాజుబాబును సత్కరిస్తున్న పార్టీ నాయకులు

కిర్లంపూడి: క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి శక్తి వంచనలేకుండా కృషి చేయాలని జగ్గంపేట నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ దాట్ల కృష్ణవర్మ సూచించారు. బీజేపీ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన శరకణం రాజుబాబును కిర్లంపూడిలో గురువారం ఆయన పూలమాల, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు యడాలి రాంబాబు, కంఠ కాశీవిశ్వనాథం, ప్రభాకర్ దొడ్డ అప్పారావు, జ్యోతుల దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

బతుకుబండి నడిచేదెలా ?

- ఉపాధి కూలీలకు పది వారాలుగా అందని కూలి డబ్బులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న కూలీలు
- అరకొరగానే వందరోజుల పనిదినాలు



రాజుపేట గుర్నన్న చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

తుని రూరల్: ఆరుగాలం శ్రమించి చేసిన ఉపాధి హామీ పనులకు డబ్బులు ఇవ్వకపోతే ఎలా బతకాలని కూలీలు వాపోతున్నారు. చేసిన పనికి 15 రోజుల్లో కూలి డబ్బులు చెల్లించాల్సిన సర్కారు ఈ సంవత్సరం జనవరి రెండో వారం నుంచి చెల్లింపులు చేయకపోవడంతో ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కూలి పనులే జీవనాధారం కావడంతో మండుటెండను సైతం లెక్కచేయకుండా పనులు చేస్తున్నారు. వారాలు తరబడి కూలి డబ్బులు చెల్లించకపోవడంపై కూలీలు ఆందోళన చెందుతున్నారు. తుని నియోజకవర్గంలో మార్చి 19కి రూ.5.31 కోట్లకుపైగా వేతన బకాయిలు పేరుకుపోయాయి. ఫలితంగా పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య ఘననీయంగా తగ్గిపోతోంది. వేసవి కాలంలో ముమ్మరంగా జరగాల్సిన ఉపాధి పనులకు కొన్ని గ్రామాల్లో కూలీలు డుమ్మాకొడుతున్నారు. చేసిన పనులకు ఎప్పుడు డబ్బులు ఇస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. మండలస్థాయి అధికారులను అడిగితే ఈ రోజు, రేపు అంటూ కాలం వెళ్లదీస్తున్నారని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మూడు మండలాల్లో పది వేల నుంచి 15 వేల వరకు హాజరయ్యే కూలీల సంఖ్య ఇప్పుడు ఐదు వేలకు పడిపోయింది.

పనుల కొరత

తుని, కోటనందూరు, తొండంగి మండలాలు మెట్ట ప్రాంతం కావడం, సాగునీటి వసతులు లేకపోవడంతో సాగునీరు ఆధారంగా రబీ పంటల సాగు చేసే అవకాశాలు లేవు. దీంతో వేసవి కాలంలో ఎక్కువగా వ్యవసాయ కూలీలు ఉపాధి పనులకు హాజరవుతుంటారు. ఆశించిన స్థాయిలో ఎన్ఆర్ఈజీఎస్ పనులు కల్పించకపోవడంతో కూలీలు అల్లాడుతున్నారు. పనులున్న కొన్ని గ్రామాల్లో వందల సంఖ్యలో కూలీలు హాజరవుతున్నారు. మరికొన్ని గ్రామాల్లో పనుల్లేక హాజరు శాతం తగ్గిపోతోంది. అధికారులు పనులు కల్పించాలని, చేసిన పనులకు కూలి డబ్బులు చెల్లించాలని కోరుతున్నారు.

అరకొరగా వందరోజుల పనిదినాలు

గ్రామాల్లో వ్యవసాయ కూలీల వలసలు నివారించి, ప్రతి కుటుంబానికి వంద రోజులు పనిదినాలు కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని ప్రవేశపెట్టింది. మరో పది రోజుల్లో ఈ ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. వేల సంఖ్యలో జాబ్‌కార్డులు పొందిన కుటుంబాలు ఉండగా వందరోజులు పూర్తి చేసిన కూలీల సంఖ్య నియోజకవర్గంలో మూడంకెలు దాటలేదు. మూడు మండలాల్లో ఈ నెల 17వ తేదీకి వందరోజులు పూర్తి చేసింది కేవలం 602 కుటుంబాలే. మార్చి 31 నాటికి ఎన్ని కుటుంబాలు వందరోజుల పనిదినాలు పూర్తి చేస్తారో, చేసిన పనులకు కూలిడబ్బులు ఎప్పుడు చెల్లిస్తారో వేచి చూడాల్సిందే.

వారంలో బకాయిల చెల్లింపు

ఉపాధి కూలీల బకాయిలు చెల్లింపులో జాప్యం ఏర్పడింది వాస్తవమే. వచ్చే వారంలో మొత్తం బకాయిలు చెల్లించేందుకు ఉన్నత అధికారులు చర్యలు తీసుకున్నారు. ఏప్రిల్ నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం మొదలవుతుండడంతో ఇప్పటికే సెల్ఫ్‌లో ఉన్న పనులు చేస్తున్నారు. కొత్త పనులకు ఎస్టిమేట్లు తయారు చేస్తున్నారు. వచ్చే నెల నుంచి కొత్త ఎస్ఎస్ఆర్ రేట్లు, దినసరి వేతనం పెరిగే అవకాశం ఉంది. ఆ తర్వాత నుంచి ఉపాధి పనులు ముమ్మరమంగా చేపడతాం.

– పసుపులేటి నారాయణరావు, ఏపీఓ, తుని

నియోజకవర్గంలో మార్చి 19కి వేతన బకాయిలు, 100 రోజులు పూర్తి చేసిన కుటుంబాలు

మండలం	వేతన బకాయిలు	జాబ్‌కార్డులు సంఖ్య	పనులు చేస్తున్న కూలీల సంఖ్య	వందరోజులు పూర్తి చేసిన కూలీలు
తుని	రూ.1.80 కోట్లు	12,600	2959	217
కోటనందూరు	రూ.2.23 కోట్లు	8,200	1148	202
తొండంగి	రూ.1.28 కోట్లు	13,250	857	183
మొత్తం	రూ.5.31 కోట్లు	34,050	4964	602

పారదర్శకంగా పీ4 సర్వే గ్రామ సభలు



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సాయినవీన్

తుని రూరల్: ప్రభుత్వం, ప్రైవేట్, ప్రజా భాగస్వామ్యంపై చేపట్టిన పీ4 సర్వే గ్రామ సభలను పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీఓ కె.సాయినవీన్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, మండలస్థాయి అధికారులకు గ్రామసభల నిర్వహణపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సర్వేలో నమోదైన పేర్లను స్పష్టంగా గ్రామసభల్లో చదివి వినిపించాలన్నారు. అనంతరం సభ ఆమోదం తీసుకోవాలన్నారు. 21, 22 తేదీల్లో నిర్వహించాల్సిన గ్రామసభలను పరిపాలనా కారణాల వల్ల వాయిదా వేసినట్టు తెలిపారు. ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామన్నారు. పరిపాలన అధికారి ఎంపీఎస్.శేషగిరిరావు, ఈఓపీఆర్డీ జి.మరిడియ్య పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత సునీతా విలియమ్స్



ఏలేశ్వరంలో హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న చైర్‌పర్సన్ సత్యవతి, తదితరులు

ఏలేశ్వరం: వ్యోమగామి సునీతా విలియమ్స్ అంతరిక్షం నుంచి భూమి మీదకు సురక్షితంగా రావడంతో పట్టణంలో గురువారం సంబరాలు నిర్వహించారు. స్థానిక ఎంపీపీ మెయిన్ పాఠశాలలో మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్వర్యంలో విద్యార్థులు సునీతా విలియమ్స్ చిత్ర పటం, జాతీయ పతాకాన్ని పట్టుకుని హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ భరతమాత ముద్దుబిడ్డ సునీతా విలియమ్స్ సురక్షితంగా భూమి మీదకు చేరుకోవడం హర్షణీయమన్నారు. సునీతా విలియమ్స్ ప్రపంచంలో కోట్లాది మందికి ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రజలు, దేవుని ఆశీస్సులతో సునీతా విలియమ్స్ సంపూర్ణ ఆరోగ్యం పొందాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ అబ్బాయి, వైద్యుడు విజయబాబు, లయన్స్ క్లబ్ ప్రతినిధి అలమండ దుర్గావెంకటప్రసాద్, అలమండ వీరరాఘవస్వామి, బూర్లు సత్తిబాబు, వైబోగుల సుబ్బారావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



రౌతులపూడి హైస్కూల్‌లో విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

రౌతులపూడి: వచ్చే విద్యా సంవత్సరంలో జరిగే ఎన్ఎంఎంఎస్ పరీక్ష ప్రిపరేషన్‌కు అవసరమయ్యే స్టడీ మెటీరియల్‌ను స్థానిక జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం కె.రాంబాబు ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు అందజేశారు. కోనసీమ జిల్లా మామిడికుదురు ఎంపీడీఓగా ఉద్యోగ విరమణ చేసిన గోజే రామశివాజీ ఆర్థిక సహకారంతో వీటిని కొనుగోలు చేశారు. రూ.8 వేల విలువ చేసే పుస్తకాలను ప్రస్తుతం ఏడో తరగతి చదువుతున్న 22 మంది విద్యార్థులకు అందజేశారు. పుస్తకాలు సమకూర్చిన దాత రామ్‌శివాజీని ప్రధానోపాధ్యాయుడు, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.అచ్చిరాజు, సీహెచ్ నాగేశ్వరరావు, పి.విఘ్నేశ్వరరావు, సీహెచ్ బాలబాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎరుపు, తెలుపు రంగుల దినోత్సవం



రంగుల దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో ఎరుపు, తెలుపు రంగుల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఎరుపు, తెలుపు రంగుల దుస్తులు ధరించి బెలూన్స్‌తో సందడి చేశారు. ఈ సందర్భంగా శ్రీప్రతిభ విద్యాలయం అధినేత దాసం శేషారావు మాట్లాడుతూ రంగులు మన జీవితంలో ఆనందం, చిరునవ్వు, వినోదం అర్థాన్ని పంచుతాయన్నారు. చిన్నారులకు రంగుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఓ పి.నాగేశ్వరరావు, హెచ్ఎం డి.సత్యనారాయణ, సుధా, ఆషారాణి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో రోడ్ల నిర్మాణం

కిర్లంపూడి: నాణ్యతా ప్రమాణాలు పాటించి రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నట్టు డీఈ ఉమాశంఖర్ తెలిపారు. మండలంలోని సింహాద్రిపురంలో రూ.1.25 కోట్లతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉమాశంఖర్ మాట్లాడుతూ గ్రామంలోని 415 మీటర్లు సిమ్మెంట్ రోడ్డు, మిగితా 2 కిలోమీటర్లు బీటీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఈ వెంకటనారాయణ, టెక్నికల్ అసిస్టెంట్ సిద్దు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన



శృంగవృక్షంలో నిరసన తెలుపుతున్న జైభీమ్ మాలమహానాడు నేతలు

తొండంగి: ప్రభుత్వం చేపట్టిన ఎస్సీవర్గీకరణను వ్యతిరేకిస్తూ జైభీమ్ మాలమహానాడు ఆధ్వర్యంలో గురువారం శృంగవృక్షంలో ఆందోళన చేశారు. జైభీమ్ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు, బీఎస్పీ తుని నియోజకవర్గ ఇన్‌చార్జి తంతటి కిరణ్‌కుమార్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నల్లబ్యాడ్జీలు ధరించి రహదారిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా జరుగుతున్న ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలన్నారు. దళితుల అభివృద్ధికి కృషి చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యుత్సాహంతో ఎస్సీ వర్గీకరణ చేస్తున్నాయని, వాస్తవిక జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ శాతాన్ని నిర్ణయించాలన్నారు. ఎస్సీ వర్గీకరణ గురించి రాజ్యాంగంలో ప్రస్తావన లేదన్నారు. అంబేడ్కర్ ఆలోచనలకు ప్రస్తుత ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు, కార్పొరేషన్ నిధులు విడుదల చేయడంతో పాటు ఎస్సీ ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ పెయ్యల సూర్యారావు, మండల కమిటీ సభ్యుడు బూర్తి ఏలియ్య, చిట్టిమూరి బాలు, బండి చిట్టిబాబు, నేపా కృష్ణ, బూర్తి విక్టర్ బాబు, చెక్కా భీమరాజు, దుత్తరపు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

గిరిబాబును కలసిన వైఎస్సార్ సీపీ నాయకులు



కిర్లంపూడిలో గిరిబాబును కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు

కిర్లంపూడి: వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబును కిర్లంపూడిలోని ఆయన నివాసంలో గురువారం పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు గిరిబాబుతో గ్రామాల్లో సమస్యలపై చర్చించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని గిరిబాబు సూచించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు సుంకర రాంబాబు, సామాంతుల కుమార్, గుమ్ములూరి వెంకటరమణ, చీమల వెంకన్నబాబు, ఎం.లచ్చారావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ కార్యదర్శులకు పదోన్నతులు

ప్రత్తిపాడు: మండలంలోని ఇద్దరు గ్రేడ్‌-5 సచివాలయ కార్యదర్శులకు గ్రేడ్ 4 కార్యదర్శులుగా పదోన్నతి లభించింది. వారు పదోన్నతిపై ఇతర మండలాలకు బదిలీ అయ్యారు. మండలంలోని ప్రత్తిపాడు-3 సచివాలయ కార్యదర్శి ఫక్కుర్తి శ్రీనివాసరావు మారేడుమిల్లి పంచాయతీకి, వాకపల్లి కార్యదర్శి లొండా గంగాధర్ రాజవొమ్మంగి మండలం మారేడుబాక పంచాయతీకి బదిలీ అయ్యారు. పదోన్నతులు పొందిన కార్యదర్శులను ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు, ఈఓఆర్డీ కేవీవీఎస్ కాశీవిశ్వనాథం, ఎంపీడీఓ కార్యాలయ పరిపాలనాధికారి జె. శ్రీనివాసు, మూర్తి, సురేష్, రత్నం తదితరులు అభినందించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

జగ్గంపేట: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలి విద్యుత్ మీటర్ల రీడింగ్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు.ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ల రీడర్స్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘ నాయకులు గురువారం కాకినాడలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎలక్ట్రికల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ప్రసాద్‌కు పలు డిమాండ్ల కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

జగ్గంపేట: ఓ ప్రైవేటు స్కూల్‌కు చెందిన వాహనం అదుపు తప్పిన ఘటనలో త్రుటిలో ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. జగ్గంపేటలోని అక్షర ప్రైవేటు స్కూల్‌కు చెందిన వాహనం గురువారం ఇర్రిపాక నుంచి స్కూల్ విద్యార్థులను తీసుకుని మర్రిపాక వెళ్లే మార్గం నుంచి వస్తుండగా వ్యాన్ అదుపుతప్పి పంట కాలువలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో విద్యార్థులకు స్వల్పగాయాలైనట్టు తెలిసింది.

రేపు మండల సమావేశం

తొండంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వ సభ్య సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ బి.రాజేశ్వరరావు గురువారం తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

131 మందికి కంటి వైద్య పరీక్షలు



ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఉచిత కంటి పరీక్షలు చేయించుకుంటున్న ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరు తుని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో తునికి చెందిన లక్ష్మి కంటి ఆస్పత్రి వైద్యుల పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత ప్రారంభించారు. డాక్టర్లు 131 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. డాక్టర్ సత్యనారాయణ వైద్యసేవలు అందించారు. రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ అలీన, అధ్యాపకులు ఎం.శ్రీనివాస్, గణేష్, దుర్గాప్రసాద్, డాక్టర్ లక్ష్మి, ఎ.పుష్పలత, ఎ.సింహాద్రి, ఎస్.ప్రియాంక, ఎస్.భాగ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు తప్పనిసరి

గండేపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు పొందాలంటే రైతులు విధిగా విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేయించుకోవాలని జగ్గంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు ఇంటి గంగాధర్‌కుమార్ సూచించారు. మండలంలోని ఉప్పలపాడు సచివాలయం వద్ద గురువారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు రైతులకు అందించే సంక్షేమ పథకాలు పొందాలంటే విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేయించుకోవాలన్నారు. గండేపల్లి మండలంలో ఇప్పటివరకూ 65 శాతం మాత్రమే నమోదైందని, వంద శాతం పూర్తి చేయించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ సద్గురు మూర్తి, ఏఈఓ చంద్రమౌళి, వీహెచ్ఏ సుధ, రైతులు పాల్గొన్నారు.

నేడు, రేపు జిల్లాస్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో శుక్ర, శనివారాల్లో జిల్లాస్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్‌-2025 కార్యక్రమం నిర్వహించనున్నట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి గురువారం తెలిపారు. దీనిలో పాల్గొనేందుకు కాకినాడ, తూర్పు గోదావరి, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, అల్లూరి సీతారామరాజు, యానాం జిల్లాలకు చెందిన 585 మంది విద్యార్థులు తమ పేర్లను పోర్టల్‌లో నమోదు చేసుకొని వీడియో అప్‌లోడ్ చేశారన్నారు. వీరిలో 170 మందిని స్క్రీనింగ్ ద్వారా ఎంపిక చేశామన్నారు. ఈ పోటీల్లో ఉత్తమ స్పీకర్లను 10 మందిని ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ప్రోఎంబీ శ్రీనివాస్, ప్రో వైస్ చాన్సిలర్ రమాశ్రీ, రిజిస్ట్రార్ జి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి
- అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ



శిక్షణ తరగతుల్లో జ్యోతి వెలిగిస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి



తునిలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత



శంఖవరంలో శిక్షణకు హాజరైన అంగన్‌వాడీ సిబ్బంది

ఏలేశ్వరం: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ బీ, పఢాయి బీ కార్యక్రమంపై మూడురోజుల పాటు నిర్వహించే శిక్షణా తరగతులను బుధవారం ఎంపీపీ ప్రారంభించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నవ చేతన(0–3 ఏళ్ల), ఆదర్శశీల (3–6 ఏళ్ల) కార్యక్రమాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల విద్యపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కేంద్రాల్లో పౌష్టికాహారం విధిగా అందజేయాలన్నారు. తొలుత జ్యోతి ప్రజల్వన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సూర్యకుమారి, చక్రవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారుల సమగ్రాభివృద్ధిలో అంగన్‌వాడీల పాత్ర కీలకం

తుని రూరల్: చిన్నారుల సమగ్రాభివృద్ధి, ఎదుగుదలను నిర్ధారించడంలో అంగన్‌వాడీ కార్యకర్తల పాత్ర కీలకమని ఐసీడీఎస్ సీడీపీఓ కె.శ్రీలత అన్నారు. పోషణ్ భీ -పఢాయి భీ రెండో విడత కార్యక్రమంలో భాగంగా మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణా తరగతులను తునిలో గురువారం ప్రారంభించారు. 0–6 నెలల పిల్లల్లో సమగ్ర అభివృద్ధిని నిర్ధారించడానికి మహిళ, స్త్రీ శిశు సంక్షేమశాఖ రూపొందించిన నవచేతన, ఆదర్శ శీల, దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణలపై అంగన్‌వాడీలకు కేంద్ర ప్రభుత్వం శిక్షణ ఇస్తుందని సీడీపీఓ శ్రీలత పేర్కొన్నారు. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని బోధనాశక్తిని పటిష్టం చేసుకోవాలన్నారు. ఆటపాటల ద్వారా పిల్లలకు అభ్యాసన శక్తి, పౌష్టికాహారం, ఆరోగ్యంపై శ్రద్ధ కలిగించాలన్నారు. పట్టణంలో బ్యాంకు కాలనీ మున్సిపల్ హైస్కూల్, రూరల్ ఐసీడీఎస్ కార్యాలయం, కోటనందూరు, తొండంగి మండల కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు. తుని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 195 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణకు హాజరయ్యారన్నారు. ఏసీడీపీఓ నిహారిక, సూపర్‌వైజర్లు రమణమ్మ, విజయలక్ష్మి, కృష్ణకుమారి, వాణి పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలు

జగ్గంపేట: అంగన్‌వాడీ కేంద్రాలను కార్పొరేట్ ప్లే స్కూల్స్‌కు దీటుగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించిన పోషణ బి పడాయి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను కార్పొరేట్ ప్లే స్కూల్స్‌కు దీటుగా తీర్చిదిద్దాలని, అందుకు కావాల్సిన సహకారం అందజేయనున్నట్టు తెలిపారు. మూడు నుంచి ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు శుభ్రత, పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ, జగ్గంపేట ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారులకు సకాలంలో పోషకాహారం అందించాలి

శంఖవరం: అంగన్‌వాడీ చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు సకాలంలో పోషకాహారం అందించాలని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి సూచించారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో గురువారం అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ మిషన్ 2.0లో భాగంగా అంగన్‌వాడీలకు మూడు రోజులు పాటు శిక్షణ ఇస్తామన్నారు. బాలింతలు, గర్భిణులు ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అరుణాశ్రీ పాల్గొన్నారు.